క్లుప్తంగా

16 నుంచి శిక్షణ తరగతులు

కారంచేడు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బందికి ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఎల్‌ఎస్‌డీజీలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు, రెండు బ్యాచ్‌లుగా విభజించామన్నారు. మొదటి బ్యాచ్‌లో 16, 17వ తేదీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, స్వర్ణపాలెం, యర్రంవారిపాలెం, ఆదిపూడి, దగ్గుబాడు గ్రామాల్లో జరుగుతాయన్నారు. 18,19వ తేదీల్లో కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, పోతినవారిపాలెం, తిమిడెదపాడు, రంగప్పనాయుడువారిపాలెం, నాయుడువారిపాలెంలో శిక్షణ జరుగుతుందన్నారు.

దివ్యాంగులపై వివక్ష వద్దు


భవిత కేంద్రానికి చేయూతనిస్తున్న దాత

బల్లికురవ: దివ్యాంగ చిన్నారులకు తెలివితేటలుంటాయని.. వారి పట్ల వివక్ష విడనాడి సాధారణ పిల్లలతో సమానంగా చూడాలని అద్దంకికి చెందిన బి. చైతన్యకిషోర్ అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రానికి ఆయన 3 కుర్చీలు, స్టాండ్ అందజేశారు. ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ భవిత కేంద్రానికి గత 5 సంవత్సాలుగా దాతలు ఇస్తున్న తోడ్పాటుతోనే సౌకర్యాలు సమకూరుతున్నాయన్నారు. ఐఈఆర్పీలు నాగబాబు, నాజిని పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మార్టూరు: మార్టూరులోని వెంకయ్య వృద్ధాశ్రమంలో బుధవారం దాతలు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చీరాలకు చెందిన.. కావలి వన్ టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ తన పుట్టినరోజు సందర్భంగా ఆయన తల్లిదండ్రులు నూర్జహాన్, అస్సలామ్ పేరుమీద ఆశ్రమంలోని వృద్ధులకు చలికాలం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. మైనార్టీ నాయకులు గడ్డం మస్తాన్వలి, పోలీస్ శాఖ సిబ్బంది నాగూర్ వలి, పీరువలి, కాలేషా, అబ్దుల్ కలాం, రషీద్ ఆశ్రమ నిర్వాహకుడు శివ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మేదరమెట్ల గ్రామంలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈమేరకు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రాజారావు

అద్దంకి: మోటార్ బైక్‌ను జేసీబీ ఢీ కొట్టిన ఘటనలో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కలవకూరు రోడ్డులో బుధవారం జరిగింది. చిమ్మిరిబండకు గ్రామానికి చెందిన రాజారావు కలవకూరు నుంచి మార్కెళ్ల వెళ్తుండగా మండలంలోని కలవకూరు రోడ్డులోని మలుపులో జేసీబీ ఢీ కొట్టింది. రాజారావుని 108 సిబ్బంది అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


ఆలయ గర్భ గుడిలోని శివలింగం


భీమలింగేశ్వర ఆలయం


ఆలయ ప్రాంగణంలోని శాసనాలు


అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చి దిద్దిన పంగులూరు ఖోఖో మైదానం

విలక్షణ ఊరు.. పంగులూరు

- రాజకీయాలు, క్రీడలు, ఉద్యమాల్లో ప్రత్యేక గుర్తింపు
- 900 ఏళ్ల చరిత్ర కలిగిన పంగులూరు భీమలింగేశ్వర దేవాలయంలో నిత్య ధూపదీప నైవేద్యాలు

జె.పంగులూరు:

మండల కేంద్రం పంగులూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా చారిత్రక ఆధారాలు కలిగిన ఈ గడ్డ మరెన్నో అంశాల్లో తనదైన మార్క్‌తో ఇతర గ్రామాల్లో విలక్షణంగా నిలిచింది. గతంలో పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకోగా పుట్టిన ఉద్యమంతో పంగులూరు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇక ఖోఖో అంటే పంగులూరు.. పంగులూరు అంటే ఖోఖో అన్నంతగా ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దుతోంది.

ఇక్కడ నిర్మించిన శ్రీ భీమలింగేశ్వర దేవాలయానికి 900 ఏళ్ల చరిత్ర కలిగి ఉండటం విశేషం. కొణిదన చోళులు అయిన త్రిభువన మల్లుడు అనే రాజు పంగులూరులో స్వామి వారి దేవాలయం నిర్మించి, భూదానం చేసినట్లు ఆలయ ప్రాంగణంలో శాసనాలు చెబుతున్నాయి. బల్లికురవ మండంలోని కోణిదన గ్రామం రాజధానిగా చేసుకొని తూర్పున బంగాళాఖాతం, దక్షిణం పాకణాల, ఉత్తరం కృష్ణానది, దక్షిణం నన్నూరు వరకు పరిపాలని సాగించినట్లు ఆధారాలున్నాయి. అనంతరం ఈ ప్రాంతాన్ని కాకతీయులు, యాదవ రాజులు, రెడ్డి రాజులు, విజయనగరం రాజుల, వెంకటగిరి రాజులు, మహ్మదీయులు, జమ్మిదారులు, ఆంగ్లేయులు ఇలా పరిపాలించుకుంటూ వచ్చారు. 500 ఏళ్ళ నాడు వెంకటగిరి రాజు అయిన కుమార తిమ్మన యాచంద్రుడు ఈ ఆలయానికి ధూపదీపం నైవేద్యాలు నిమిత్తం కొత్తం పొలం దానం ఇచ్చినట్లు ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి. కానీ ఆలయ చరిత్ర గల శాసనాలు విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సూర్య చంద్రులు ఉన్నతం వరకు ఆలయ శాసనాలు ఇలానే ఉండాలని, భూమిని ధూపదీప నైవేద్యాలకు మాత్రమే వాడాలని ఉంది.

పత్తి రైతుల ఉద్యమ పునాది.. ఈ గడ్డ


పంగులూరు వ్యూ

1987 ప్రాంతంలో పత్తికి తెల్లదోమ సోకి రైతులు పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆ సంవత్సరంలో ఈ ప్రాంతంలో మొత్తం 36 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ సమయంలో పత్తి రైతుల ఉద్యమం ఈ గ్రామం నుంచే పుట్టింది. ఆ ఉద్యమంతో దేశం మొత్తం పంగులూరు వైపు చూసింది. దీంతో రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ పీడీ ఓజా ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఏక సభ్య కమిటీ వేశారు. పత్తి రైతులకు అప్పటి కేంద్ర ప్రభుత్వం రూ. 10 వేలు రుణమాఫీ చేసింది.

క్రీడల్లో జాతీయ స్థాయి గుర్తింపు

దశబ్దాల నుంచి పంగులూరు ఖోఖో క్రీడల్లో క్రీడాకారులు దేశ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నారు. పంగులూరులో శిక్షణ పొందిన ఎందరో క్రీడాకారులు రాణించి ఉపాధి అవకాశాలు పొందగలిగారు.

సాగర్ ఆయకట్టు చివరి భూములు

పంగులూరులో మగాణి పొలాలకు కొదువలేదు. రైతులకు, వ్యవసాయ కూలీలకు ఎప్పుడు చేతి నిండా పనులు ఉండేవి. కానీ ఐదు సంవత్సరాల నుంచి పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. కానీ గత రెండు సంవత్సరాలుగా కొంతమేర పంట ఆశాజనకంగా ఉంది. ఆరంభంలో వర్షాలు సంవృద్ధిగా పడటంతో పాటు, సాగర్ కాలువకు నీరు అందుతుండటంతో మళ్లీ పూర్వవైభవం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పాడి పరిశ్రమలో..

1987 తర్వాత పత్తి పంటలో నష్టాలు చవిచూసిన రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమపై మొగ్గు చూపారు. అప్పట్లోనే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాల ఉత్పత్తిలో పంగులూరు ప్రథమ స్థానంలో ఉండేది. అప్పట్లో పాల ఉత్పత్తికి కృషి చేసిన బాచిన గోపాల్‌ను ఆ నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు సత్కరించారు. కానీ ప్రస్తుతం పాలకేంద్రం శిథిలావస్థకు చేరగా.. పంగులూరులో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది.

బాల్య వివాహాలతో అనర్థాలు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుభద్ర

పర్చూరు (చినగంజాం): బాల్యవివాహాలను అరికట్టి ఉన్నత విద్యావంతులను చేసి చిన్నారుల ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీఓ సుభద్ర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర వికాసం బాలికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. లైంగిక వేధింపుల నుంచి వారికి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ కిశోర వికాస కమిటీలు గ్రామ స్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు సంబంధించిన అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామయ్య, ఏపీఎం రామకృష్ణ, జిల్లా ఐసీడీఎస్ లీగల్ అడ్వైజర్ మౌనిక, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సీహెచ్‌ఓ ఏ వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, కిశోర్ వికాసం కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలి


చీరాల: గ్రామ రెవెన్యూ అధికారులకు సూచనలందిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను సత్వరమే విచారణ చేసి ప్రజలు న్యాయం చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.

విత్తన శుద్ధి చేయాలి

చీరాల రూరల్ : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం దేవినూతల, కావూరివారిపాలెంలో నిర్వహించారు. విత్తన శుద్ధి చేయాలని, ఎకరా మొక్కజొన్న పంటకు చుట్టూ జొన్నపైరును వేసుకోవాలని సూచించారు. వీఏఏలు ఆఫియా, హడ్డా, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు గమనించాలి

జె.పంగులూరు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గమనించి, నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. బైటమంజులూరు, ముప్పవరంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు కనిపిస్తుందని దీనిని నివారించాలన్నారు.

మల్బరీ సాగు రైతులకు లాభదాయకం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మల్బరీ సాగు రైతులకు లాభదాయకమని ఉమ్మడి ప్రకాశం జిల్లా సెరికల్చర్ అధికారి పి. సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం కొమ్మాలపాడు రైతు సేవా కేంద్రంలో మల్బరీ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ మల్బరీ తోటల పెంపకం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, ప్రోత్సాహకాల గురించి రైతులకు తెలిపారు. ఏఎస్‌వో శివనాగిరెడ్డి, వీఎస్ఏప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో ఉల్లికోడు నివారణ

అద్దంకి: సరైన సస్యరక్షణ చర్యలతో తెగులును నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. ఆయన బుధవారం తిమ్మాయపాలెం,రామాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సలహాలు అందజేశారు. ఉద్యానశాఖ అధికారి దీప్తి, వ్యయసాయ శాఖ సహాయకురాలు ఖాజాబీ పాల్గొన్నారు.

పర్చూరులో జాబ్ మేళా రేపు

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13 వతేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ తెలిపారు. స్థానిక బీఏఆర్ అండ్ టీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. 18 నుంచి 30 ఏళ్లుగల గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 6302764962, 7989697996 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకుడు దేవదాసు

మార్టూరు: మార్టూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అదే కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు చిలకా దేవదాసు తన సొంత నిధులతో మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రభుత్వ కళాశాలలలో ఉత్తీర్ణతా శాతం పెంపొందించడం కోసం సంకల్ప్ 2025లో భాగంగా ఇంటర్మీడియెట్ బోర్డు వారు రూపొందించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డీవీ శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

బీమాతో కుటుంబ సభ్యులకు ధీమా


అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు బీమా నగదు అందిస్తున్న మేనేజర్ బాలాజీ

అద్దంకి: ప్రమాదవశాత్తు బ్యాంకు ఖాతాదారుడు మృతిచెందిన సమాయంలో బీమా వారి కుటుంబానికి ధీమా ఇస్తుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ జె. బాలాజీ అన్నారు. గత నెల నాలుగో తేదీన అనారోగ్య కారణంతో మృతిచెందిన ఇడమకంటి అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు ఐఎఫ్ఎల్ఐసీకి చెందిన రూ.1.59 లక్షల బీమా చెక్కును బుధవారం బ్యాంకు మేనేజర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. బ్యాంకు సిబ్బంది శ్రీను, బ్రహ్మయ్య, బాద్యా నాయక్, నవీన్, పాల్గొన్నారు.

లంచ్ బాక్స్‌లు వితరణ

చినగంజాం: క్రిస్మస్ పండగ పురస్కరించుకొని చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో నిర్వహిస్తున్న క్రిస్మస్ చిన్నారులకు దాతలు లంచ్‌బాక్స్‌లు అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్ బాబు ఆధ్వర్యంలో దాతలు స్వయంగా చిన్నారులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో దైవసేవకులు జాన్ అబ్రహం లింకన్‌బాబు, గ్రామ పెద్దలు మేడికొండ భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ సంఖ్యా సుజాత, యూత్ సభ్యుడు అల్లడి నవీన్, మేడికొండ సాధామిని పాల్గొన్నారు.



చిన్నారులకు లంచ్ బాక్స్‌లు అందిస్తున్న దాతలు

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు షురూ


పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్నికల అధికారి ఝాన్సీ

జె.పంగులూరు: మండలంలోని కొండమంజులూరు-2 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం ఎన్నికల అధికారి తిరుమల శెట్టి ఝాన్సీ విడుదల చేశారు. ఈ మేరకు కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద, కొండమంజులూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నోటిఫికేషన్ పత్రాలను అంటించి దండోరా వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 12 టీసీలు కూడా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి ఈ నెల 14 వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది తెలిపారు. ఉదయం 8 గంటలకు రైతులు నామినేషన్ దాఖలు చేయాలని, అనంతరం పరిశీలన జరిపి.. అభ్యర్థులను గుర్తించి, ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన అభ్యర్థుల ద్వారా అదే రోజు సాయంత్రం అధ్యక్షుడిని, ఉపాధ్యక్షులని ఎన్నుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల ఆఫీసర్ టి. కరుణాకర్ పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల ఆందోళన


వల్లాపల్లిలో నేలవాలిన వరి

బల్లికురవ: వరుస తుఫాన్‌లతో బల్లికురవ మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించిన పండించిన ఆహార ధాన్యమైన వరి నేలవాలింది. వల్లాపల్లి, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారి పాలెం, వైదన, కొప్పరపాడు, కూకట్లపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో సాగుచేసిన వరి కోత దశకు చేరింది. ఫెంగల్ తుఫాన్ వల్లన్‌కొంత మేర నష్టం జరగ్గా, మళ్లీ అల్పపీడన ప్రభావంతో ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండండి

తుఫాన్ హెచ్చరికలతో రైతులంతా మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ప్రత్తి పొలాను పరిశీలించారు. వరి కోతలను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు.


ఉప్పమాగులూరులో రైతులతో మాట్లాడుతున్న కుమారి

శిల్పం.. చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు

అద్దంకి రూరల్: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కలశం ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో దళితులకు ఈ నెల 16 నుంచి 22 వరకు రాష్ట్ర స్థాయిలో శిల్పం- చిత్రలేఖనంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలశం ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డి. అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా భోజనం, వసతి, అవసరమైన మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన దళిత విద్యార్థులు 9182681614 నంబరును సంప్రదించాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

చినగంజాం: రైతులు భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా సత్వరం పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం మండలంలోని మున్నం వారిపాలెం పంచాయతీ పరిధిలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. మండల సర్వేయర్ సుబ్బారావు, సర్వేయర్‌లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు తహసీల్దార్ పి. బ్రహ్మయ్య రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నూతలపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సును సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య అధ్యక్షత నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ఐ బి. ప్రేమ్‌కుమార్, సర్వేయర్ ఎన్. అరుణ, ఎండోమెంట్ ఈఓ దామా నాగేశ్వరరావు, డాక్టర్ ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.


చినగంజాం: రెవెన్యూ సదస్సులో అర్జీలు అందుకుంటున్న తహసీల్దార్


బుర్లవారిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ


అద్దంకి : మాట్లాడుతున్న షేక్ మొహిద్దీన్ బాషా


పర్చూరు: అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

చీరాల టౌన్: తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణకు బుధవారం బుర్లవారిపాలెం గ్రామ సచివాలయం వద్ద ఆయనకు పలు అర్జీలు అందించారు. రెవెన్యూ, భూ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీటీ దేవతోటి అర్జున్, వీఆర్వోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అగ్రహారం, ఇనామ్ భూములకు సంబంధించి భూమి సాగు చేసుకుంటున్న రైతులకు భూహక్కు కల్పించి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని అఖిలభారత రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం కొమ్మాలపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్పెషల్ అధికారి మక్కెన రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.